ప్రజాశక్తి
మంగళవారం 5 డిసెంబర్ 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





అలర్ట్



శింగరాయకొండ మండలం, పాకలలో కోతకు గురైన సముద్ర తీరం

- ప్రకాశం, బాపట్ల జిల్లాలకూ మిచౌంగ్ ముప్పు..
- రెండు జిల్లాల్లోనూ తుఫాన్ ప్రభావం
- బాపట్లలో రెండు లక్షల ఎకరాల్లో వరి పైరుకు నష్టం
- నిజాంపట్నంలో పదో నెంబర్ ప్రమాద హెచ్చరిక..
- తుఫాను పర్యవేక్షక ప్రత్యేక అధికారుల నియామకం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, ఒంగోలు

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాను ప్రకాశం, బాపట్ల జిల్లాలను వణికిస్తోంది. ఈ తుఫాను మంగళవారం తీరం దాటే అవకాశాలు అధికంగా ఉండగా.. ఎంత నష్టం చేకూరుస్తుందోనని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికే నిజాంపట్నంలో పదో నెంబర్ ప్రమాద హెచ్చరికను ఎగరవేశారు. అనేక చోట్ల సముద్రతీరం కోతకు గురైంది. బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌లో రెండు లక్షల ఎకరాలలో సాగు చేసిన వరిపైరు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రెండు జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. బాపట్ల జిల్లాకు తుఫాను పర్యవేక్షక ప్రత్యేక అధికారిగా కాటంనేని భాస్కర్‌ను, ప్రకాశం జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా పిఎస్ ప్రద్యుమ్నను ప్రభుత్వం నియమించింది.

తుపాను ప్రభావంతో రెండు జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షానికి తోడు బలంగా గాలులు వీస్తున్న క్రమంలో ఇప్పటికే కోతలు కోసి పనల మీద ఉన్న వరి పైరు తడిచిపోతోంది. ఇప్పటికే కొట్టిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పరిస్థితి లేకపోవడంతో రైతులు రహదారులపైనే ధాన్యాన్ని ఉంచి టార్పాలిన్లు కప్పి తడిచిపోకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. వేగంగా వీస్తున్న ఈదురు గాలుల ప్రభావంతో కోతకు వచ్చిన పంట పొలాలు నేలకొరిగిపోతున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో

▶ 2లో



భట్టిప్రోలులో తుఫాన్ కారణంగా నేలకొరిగిన వరిపంట



బాపట్లలో వర్షాలకు పొలంలోనే తడిచిపోతున్న వరి ఓదెలు



తాళ్లూరులో పంటలను పరిశీలిస్తున్న జెడిఎ శ్రీనివాసరావు

వర్షాలు కొనసాగితే

పంటలకు నష్టమే..

- ఇప్పటికే పొగాకు, కంది, శనగ రైతుల్లో ఆందోళన
- కృష్ణా డెల్టాలో వరి పంటకు నష్టం..
- మిర్చిపైనా ప్రభావం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారింది. దీని ప్రభావం తీవ్రంగానే కనిపిస్తోంది. కోస్తా ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి వర్షాలు పడుతున్నాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురగాలులు వీస్తున్నాయి. సముద్రతీరంలో అలల ఉధృతి పెరిగింది. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. తీరప్రాంతాల్లో కలెక్టర్ అప్రమత్తత ప్రకటించారు. కొన్ని చోట్ల సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, నాగులుప్పలపాడు, శింగరాయకొండ మండలాల్లో ఇప్పటికే 46 సహాయక శిబిరాలను ఏర్పాటుచేశారు. 17,538 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని గుర్తించారు. కొందరిని

▶ 2లో

మిచౌంగ్ తుఫాన్‌తో..

నష్టం జరగకుండా చర్యలు

- పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు
- 47 పునరావాస శిబిరాల ఏర్పాటు
- సిఎంకు వివరించిన కలెక్టర్



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'మిచౌంగ్' తుఫాన్‌తో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకున్నట్లు ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. తీరప్రాంత ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేయడంతోపాటు ప్రజలను తుఫాన్ పునరావాస శిబిరాలకు తరలించామన్నారు. మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత కోస్తా జిల్లాలలోని 8 మంది కలెక్టర్లతో సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, సహాయక, పునరావాస చర్యలలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, మానవతా దక్పథంతో సంతప్తికర స్థాయిలో బాధితులకు సహాయం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయాలను పరిశీలించడానికి తుఫాన్ ప్రభావిత ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఎఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తున్నట్లు సిఎం తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్‌తో పాటు ఎస్‌పి మలికా గర్గ్, సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు, ఏఎస్‌పి నాగేశ్వరరావు పాల్గొన్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖలు తీసుకోవాల్సిన చర్యలు, సమన్వయంపై దిశా నిర్దేశం చేశారు. ఈ వివరాలను అనంతరం కలెక్టర్ మీడియాకు వివరించారు. తుఫాన్ తీవ్రతపై మూడు రోజుల నుంచి తీరప్రాంత గ్రామాలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి మత్స్యకారులెవరూ సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా ముందుగానే వారికి అవగాహన కల్పించామన్నారు. ఫలితంగా పడవలు, ఇతర సామగ్రి ఒడ్డుకు చేర్చి భద్రం చేసుకున్నట్లు తెలిపారు. ఎక్కడా నీళ్లు నిలువకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామని, పునరావాస కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దష్టి పెట్టామన్నారు. కొత్తపట్నం, శింగరాయకొండ, టంగుటూరు, ఒంగోలు, నాగులుప్పలపాడు మండలాలలోని తీరప్రాంత పూరిళ్లు, ఇతర ప్రమాదకర స్థితిలో ఉన్న పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని తుఫాన్ పునరావాస శిబిరాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 18 వేల మందిపై ఈ తుఫాన్ ప్రభావం చూపుతుందని అంచనా వేశామన్నారు. వీరి కోసం 47 పునరావాస శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.

ప్రతి శిబిరానికి ఒక స్పెషలాఫీసర్

పునరావాస శిబిరాలలో ఉంటున్న వారికి నాణ్యమైన ఆహారం, తాగునీరు, ఇతర వసతులు కల్పిస్తున్నట్లు కలెక్టర్

▶ 2లో



మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ శంకర్‌రావు

గిరిజనుల అభివృద్ధికి కృషి

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ శంకర్‌రావు

▶ 8లో

'ఢిల్లీ' ధర్నాలో జిల్లా నేతలు



ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ జిల్లా నేతలు

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం సోమవారం ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా జరిగింది. ఈ ధర్నాలో ప్రకాశం జిల్లా నుండి వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శులు కంకణాల ఆంజనేయులు, బి. రఘురామ్, ఆ సంఘాల జిల్లా నాయకులు యన్.వెంకటేశ్వర్లు, ఊసా వెంకటేశ్వర్లు, కెజి మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, బడుగు వెంకటేశ్వర్లు, జె.రాజు, పి.బాబురావు, ఏ సూరిబాబు, కె వెంకటేశ్వర్లు, కె.రవి పాల్గొన్నారు.

- ప్రజాశక్తి, ఒంగోలు కలెక్టరేట్

తుఫానుతో మిరప రైతుల ఆందోళన

వర్షాలు కొనసాగితే.. పంటలకు నష్టమే..

(మొదటిపేజీ తరువాయి)

తరలిస్తున్నారు. పాఠశాలలకు రెండు రోజులు సెలవు ప్రకటించారు. రాకపోకలూ తగ్గాయి. తమిళనాడులో తీవ్రంగా ఉన్నందున జాతీయరహదారిపై వాహనాల రాకపోకలు తగ్గాయి. సోమవారం సాయంత్రం మూడు గంటలకు నమోదైన వర్షపాత వివరాలను పరిశీలిస్తే జిల్లా సగటు 3.4 మి.మీ.లు కురిసింది. వర్షాల ప్రభావం ఎంతమేరకు ఉంటుందనేదీ చూడాలి. ఇప్పటికే జిల్లా అంతటా వర్షాలు మొదలయ్యాయి. ఓ మోస్తరు జల్లులు రోజంతా కొనసాగుతూనే ఉన్నాయి. పంటలపై ఇప్పటి వరకూ పెద్దగా ఆందోళన లేకపోయినా వర్షాలు రెండు, మూడు రోజులు కొనసాగితే మాత్రం నష్టం భారీగానే ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల్లూరు జిల్లాను ఆనుకొని ఉన్న నియోజకవర్గాల్లోనే వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. ఈదురుగాలులు పెరిగాయి. కొండపి, టంగుటూరు, నాగులుప్పలపాడు, సంతనూతల పాడు మండలాల్లో వేసిన పొగాకు నాట్లకు వర్షం నష్టం కలిగించేలా ఉంది. కంది, శనగ రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే దాదాపుగా అన్ని పంటలకూ నష్టమే. పొగాకు ముందుగా వేసిన తోటలకు జిడ్డు కారిపోతుంది. తోటల్లో నీళ్ల నిలిస్తే మొక్కలు కుళ్లిపోతాయి. ఇప్పుడు వేస్తున్న నాట్లకు కూడా నష్టమేనంటున్నారు. మిర్చి కూడా పూతపిందె దశలో ఉంది. వర్షాలు ఎక్కువగా కురిస్తే పూత రాలిపోతుంది. ఇక డెల్టా ప్రాంతంలో వరికి నష్టం తప్పదు. ఇప్పటికే కొన్నిచోట్ల కోతలు కూడా మొదలయ్యాయి. బోర్లు, బావుల కింద వరి వేశారు. ఇప్పుడు చాలా చోట్ల కంకి దశలో ఉంది. ఓదెలు తడిస్తే నష్టమే.. గింజ రాలిపోవడం, తడిచి రంగు మారడం జరుగుతుందని రైతులు కలవరపడుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా పంటలపై దృష్టి సారించారు. ఇక అధికారులు కూడా తుపాను పట్ల అప్రమత్తంగానే ఉన్నారు.

అలర్ట్..

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. తుఫాను కారణంగా మాగాణి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. రైతులకు టార్పాలిన్ పట్టల అవసరం ఎక్కుగా ఉంది. తుపాను సహాయక చర్యల్లో పాల్గొనేందుకు సముద్ర తీర ప్రాంత మండలాలకు ఎన్డీఆర్ఎఫ్ బందాలు వచ్చాయి.

నిజాంపట్నంలో 10వ నెంబరు ప్రమాద హెచ్చరిక

బాపట్ల జిల్లాలో మిచౌంగ్ తుఫాను ప్రభావంతో మంగళవారం సాయంత్రం వరకు ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. అత్యవసర పరిస్థితులలో మినహా ప్రజలు ఎవరు తమ నివాసాలను వదిలి బయటకి రావద్దని జిల్లా అధికారులు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక జెసిబిని, కట్టర్ మిషన్లను, రోప్‌లను, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. జిల్లాలో 24 ప్రమాదకరమైన వంతెనలను గుర్తించి అక్కడ పోలీస్ సిబ్బందిని నియమించారు. తుఫాను ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామాలలో పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను తుఫాను షెల్టర్లకు తరలిస్తున్నారు. 111 గ్రామాలలో అధికారులతో కూడిన బృందాలను నియమించారు. అత్యవసర పరిస్థితులలో పోలీస్ శాఖ తక్షణ సహాయం కోసం ప్రజలు డయల్ 100, 112, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8333813228, స్థానిక పోలీసు అధికారులకు సమాచారమివ్వాలని జిల్లా ఎస్పీ సూచించారు.

అక్కడే అధిక వర్షాలు

తుఫాను ప్రభావం కారణంగా బాపట్ల జిల్లాలో వరి పైరుకు నష్టం వాటిల్లనుంది. కృష్ణా పశ్చిమ డెల్టాలో వేమూరు, రేపల్లే, బాపట్ల వ్యవసాయ డివిజన్ల లోనే ప్రస్తుతం వరి కోతకు వచ్చి ఉంది. వర్షానికి వరి పైరు దెబ్బతినకుండా రైతులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. అయితే అత్యధిక విస్తీర్ణంలో వరి పైరు ఉన్న మండలాల్లోనే సోమవారం రాత్రి 8.30 గంటల వరకు అత్యధిక వర్షపాతం నమోదు అయింది నగరం మండలంలో 46.4 మిల్లీమీటర్ల వర్షపాతం, కారంచేడు 30.2, రేపల్లేలో 30, చెరుకుపల్లిలో 35.2, కర్లపాలెంలో 33.2, బట్టిప్రోలులో 36.2, వేమూరులో 40.8, కొల్లూరులో 30.2, అమృతలూరులో 30, చుండూరులో 19 ఎమ్ఎమ్‌ల వర్షపాతం నమోదు అయింది. మంగళవారం భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడవుతున్న నేపథ్యంలో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ప్రజాశక్తి-పిసిపల్లి

మిచౌంగ్ తుఫానుతో మిరప రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప కొద్దిగా ధర పలకడంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు మిరప సాగు వైపు దృష్టి సారించారు. గతంలో ఎకరం మిర్చి సాగు చేసినవారు ఈ ఏడాది మూడెకరా లకు పైగానే సాగు చేశారు. వీరితో పాటు అదనంగా మరి కొంతమంది రైతులు కూడా మిర్చి సాగు చేశారు. గత వారం వర్షాల వలన మిరప చెట్లు వంగిపోయాయి. వాటిని కూలీలతో నిలబెట్టారు. ఆదివారం సాయంత్రం నుంచే వీస్తున్న మిచౌంగ్ తుఫాను ఈదురు గాలులతోపాటు సోమవారం ఉదయం నుంచే భారీగా గాలులతోపాటు ఉదయం 8గంటల నుంచి జల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో మూడు నెలల క్రితం నాటిన మిరప మొక్కలు ఏపుగా పెరగడంతో గాలికి పడిపోయాయి. దీంతో తిరిగి మొక్కను లేపిన నిలబడే పరిస్థితి లేదు. మంగళ, బుధవారాల్లో కూడా వర్షాలు పడితే మొక్క నీటిలో మునిగిపోతుంది. దీనికి తోడు వైరస్‌లు, ఆకు ముడత తెగుళ్ళ సోకే ప్రమాదం ఉంది. దీని వల్ల మిర్చి రైతులు ఆందోళనలో ఉన్నారు. మండలం మొత్తం మీద అన్ని గ్రామాల్లో మిరప సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని తోటలు కాపుకు వచ్చాయి. మరికొన్ని పూత దశలో ఉన్నాయి. ఈ మొత్తం రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. చెట్టు నీటిలో తడవడం వల్ల పూత రాలిపోతోంది. ఎకరానికి రూ.లక్ష మేర ఖర్చు చేశారు. ఈ విధంగా మిచౌంగ్ తుఫాను మిరప రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.



సాగులో ఉన్న మిరప పైరు

మూడెకరాలకు రూ.3.50 లక్షలు ఖర్చులు చేశా

వీరపునేని శ్రీరాములు, కొత్తపల్లి, రైతు



ఈ ఏడాది మూడెకరాలలో మిరప పంట సాగు చేశాను. నవంబర్ 22, 23 తేదీల్లో కురిసిన వర్షాలకు రెండు అడుగుల ఎత్తులో ఉన్న చెట్లు మొత్తం నేలకొరిగాయి. కుటుంబ సభ్యులతోపాటు కూలీలను పెట్టి చెట్లను లేపాము. తిరిగి ఆదివారం సాయంత్రం నుంచి వీచిన గాలులతోపాటు సోమవారం కురిసిన వర్షానికి భూమి లోపల తేమ ఉండి గాలికి చెట్లు వంగి నీటిలో మునిగాయి. ఇదే వర్షం మరో రెండు రోజులు కురిస్తే మిరప పంట గురించి మరిచిపోవాల్సిందే. ఇప్పటికే దాదాపు రూ.3.50 లక్షలు ఖర్చు చేశాను.

నష్టం జరగకుండా చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. తుఫాన్ సంబంధిత ఖర్చుల కోసం టిఆర్-27లో రాష్ట్ర ప్రభుత్వం మన జిల్లాకు కోటి రూపాయలు కేటాయించగా, శిబిరాలలో భోజనాలకు, ఇతర వస్తువుల కొనుగోలు కోసం తహశీల్దార్లకు తక్షణమే రూ.18 లక్షలు విధులు విడుదల చేశామన్నారు. ప్రతి పునరావాస శిబిరానికి డిప్యూటీ తహశీల్దార్ ఈఓపిఆర్‌డి వంటి అధికారులను ఇన్‌ఛార్జిలుగా నియమించామన్నారు. పరిస్థితి కుదుటపడి ఈ శిబిరాల నుంచి బాధితులు ఇళ్లకు వెళుతున్నప్పుడు ఒక్కో కుటుంబానికి రూ.2500 చొప్పున ఆర్థిక సహాయం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. నీళ్ల నిలిచి ఇళ్లలో నుంచి రెండు రోజుల పాటు బయటకు రాలేని పరిస్థితి ఉంటే ఆయా ప్రాంతాలలోని ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఒక కేజీ చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగళా దుంపలతోపాటు ఒక కేజీ వంట నూనె సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ దిశగా తీర ప్రాంతంలోని రేషన్ డీలర్ల షాపులకు సరుకులు పంపిణీ చేశామన్నారు.

రంగంలోకి ప్రత్యేక బృందాలు..

వర్షాలు, గాలుతో చెట్లు కూలితే వెంటనే వాటిని తొలగించేలా పోలీసు, ఆర్ అండ్ బి. అగ్నిమాపక శాఖల సిబ్బందితో ప్రత్యేక బందాలను నియమించి పోలీస్ స్టేషన్‌లో అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా,ప్రమాదాలు చోటుచేసుకోకుండా అప్పటికప్పుడే స్పందించేలా ఎపిసిపిడిసిఎల్ నుంచి 500 మంది సిబ్బందిని రంగంలోకి దించామన్నారు. తీర ప్రాంత మండలాలలో పరిస్థితిని నిశితంగా గమనించడానికి మండల , నియోజకవర్గ స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లుగా సీనియర్ అధికారులను నియమించామన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ పాటు ఎస్పి కార్యాలయంలోనూ ప్రత్యేకంగా కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామన్నారు. మండల స్థాయి నుంచి ప్రతి రెండు గంటలకు ఒకసారి వివరాలను తెప్పించుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలోని పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్పెషల్ ఆఫీసర్ పిఎస్ ప్రద్యుమ్నకు తెలియజేస్తున్నామన్నారు.

ప్రజలకు అండగా ప్రభుత్వం

తుఫాన్ విషయంలో అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా ఇతర శాఖలతో పోలీస్ శాఖ కూడా సమన్వయంతో పనిచేస్తున్నట్లు జిల్లా ఎస్పి మలికా గర్గ్ తెలిపారు. ఇప్పటికే జిల్లాకు చేరిన రెండు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలతో కలసి జిల్లా పోలీస్ స్వాట్ కూడా ఒంగోలు, సింగరాయకొండలలో సిద్ధంగా ఉందన్నారు. తుఫాన్ సమయంలో సముద్ర తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పిక్నిక్ కోసమంటూ సముద్రతీరానికి వెళ్ళరాదని ఆమె స్పష్టం చేశారు. ఏ అవసరం, ఆపద వచ్చినా 100 లేదా 1077కు ఫోన్ చేయాలలన్నారు. సమీక్షా సమావేశంలో డిపిఒ జివి నారాయణ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ మర్ధన్ ఆలీ, సిపిడిసిఎల్ ఎస్ఇ సత్యనారాయణ, జడ్పీ సిఇఒ బి.జాలిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఉద్యాన వన అధికారి వై.గోపిచంద్, జిల్లా పశు సవర్ధక శాఖ అధికారి బేబీరాణి, ఇరిగేషన్ ఎస్ఇ లక్ష్మారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ కొండయ్య, డిసిఎం,హెచ్ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, డిఐఒ పద్మజ, జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ, జిల్లా టిబి, కుష్ఠ నివారణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, డిటిసి ఆర్.సుశీల, సిపిఒ డి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఇఒ అనితా రాజక్ష రాణి, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు బి.ఉదయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సెమీక్రిస్మస్ వేడుకలకు 'శిద్దా' ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దర్శి

మండల పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ వారు నిర్వహిస్తున్న సెమీక్రిస్మస్ వేడుకలకు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు రూ.10 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ మొత్తాన్ని శిద్దా ప్రతినిధి మండాది సుబ్బారావు చేతుల మీదుగా పాస్టర్లు ఏసుదాసు, దేవప్రసాద్, దానియేలు, పాల్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా వారు శిద్దా రాఘవరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం, మద్దిపాడు గ్రామం, **షైక్ ఖాజా కాన్ గారి కుమారుడు కాలేషా** ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా క్లయింట్ పెంట్యాల అంజమ్మ భర్త పున్నయ్య అను వారివద్ద కొనుగోలు చేయబడి ఒంగోలు సబ్‌రిజిస్ట్రర్ వారి ఆఫీస్ లో రిజిస్టర్ కాబడిన విక్రయ **దస్తావేజునెంబర్ 1731/ 2014** ద్వారా నా క్లయింట్ కి సంక్రమించబడి తదాది నా క్లయింట్ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగి యున్నారని మరియు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థిని **"కెనిఫిన్ హోమ్స్ లిమిటెడ్"** ఒంగోలు వారి వద్ద తనఖా ఉంచి ఋణం తీసుకొనుచున్నారు. కావున ఎవరికైనను సదరు ఆస్థి గురించి గాని, హక్కుల గురించి గాని అభ్యన్తరాలు వున్నయెడల లిఖితపూర్వకంగా తగిన దస్తావేదులతో ఈ నోటీసు ప్రకటించిన **(ఏడు) దినముల లోపు,** ఈ క్రింది సంతకం దారుని సంప్రదించగరలరు. లేని యెడల ఎవ్వరికీ ఏవిధమైన అభ్యన్తరాలు గాని, హక్కులు గని లేవని భావించి మా క్లయింట్ దిగువ షెడ్యూల్ ఆస్థి పై ఋణము తీసుకొనగలరు గడువు తరువాత వచ్చు అభ్యన్తరాలును మా క్లయింట్ గాని రుణదాతను కానీ సిద్ధపరచజాలవని యావన్మందికి తెలియజేయటమైనది.

షెడ్యూల్

ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం, మద్దిపాడు గ్రామ పంచాయితీ, మద్దిపాడు గ్రామం, సర్వే నెంబర్. 206, 94 .8 చ .గ కాళీస్థలంకు హద్దులు

తూర్పు : నెల్లూరు చెంచయ్య వగైరాల భూమి -28 లిం **పడమర:** 23 లింకుల బజారు -28 లిం **ఉత్తరం:** రాచవారిపాలెం సుబ్బారావు గారి భూమి -70 లిం **దక్షిణం:** రాచవారిపాలెం సుబ్బారావు గారి స్థలం -70 లిం హద్దుల లో విస్తీర్ణం 94.8 చ .గ కాళీ స్థలం యావత్తు దారి హక్కులతో సహా

శిఖాకొల్లి రమేష్, న్యాయవాది
A-బ్లాక్, 4th ఫ్లోర్, షాప్ No: 5 (A), గుప్తస్ స్క్వైర్, 60 ఫీట్స్ రోడ్, ఒంగోలు,ప్రకాశం డిస్ట్రిక్ట్. ఫోన్ No: 9949136259.

పబ్లిక్ నోటీసు

ప్రకాశం జిల్లా, ఒంగోలు మండలం, కరవది గ్రామ నివాసి, **తిప్పగుడిశ శ్రీనివాసరావు తండ్రి** (లేట్) **అంకారావు** ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా క్లయింట్ తల్లి గారైన తిప్పగుడిశ సుబ్బులు మరియు తమ్ముడు అయిన తిప్పగుడిశ కోటేశ్వరరావు ద్వారా గిఫ్ట్ సెటిల్మెంట్ ఒంగోలు సబ్ రిజిస్టర్ వారి ఆఫీస్ లో రిజిస్టర్ కాబడిన స్వాధీన సెటిల్మెంట్ నెంబర్ **9745 / 2022** ద్వారా నా క్లయింట్ కి సంక్రమించబడి తదాది నా క్లయింట్ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగి యున్నారని మరియు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థిని **"కెనిఫిన్ హోమ్స్ లిమిటెడ్"** ఒంగోలు వారి వద్ద తనఖా ఉంచి ఋణం తీసుకొనుచున్నారు. కావున ఎవరికైనను సదరు ఆస్థి గురించి గాని, హక్కుల గురించి గాని అభ్యన్తరాలు వున్నయెడల లిఖితపూర్వకంగా తగిన దస్తావేదులతో ఈ నోటీసు ప్రకటించిన **(ఏడు) దినముల లోపు,** ఈ క్రింది సంతకం దారుని సంప్రదించగరలరు.లేని యెడల ఎవ్వరికీ ఏవిధమైన అభ్యన్తరాలు గాని, హక్కులు గని లేవని భావించి మా క్లయింట్ దిగువ షెడ్యూల్ ఆస్థి పై ఋణము తీసుకొనగలరు గడువు తరువాత వచ్చు అభ్యన్తరాలును మా క్లయింట్ గాని రుణదాతను కానీ సిద్ధపరచజాలవని యావన్మందికి తెలియజేయటమైనది. షెడ్యూల్ :ప్రకాశం జిల్లా , ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ ఏరియా, ఒంగోలు మండలం, కరవాది గ్రామ పంచాయతీ, దసరాజుపల్లి గ్రామ మజరా, కరవాది గ్రామం, డోర్ No. 8 - 9 /2, అసెస్మెంట్ No.1749, Rcc దాబా, స్థలం కు హద్దులు

తూర్పు : రోడ్, **పడమర :** దేవరపల్లి విజయమ్మ గారి ఇల్లు, **ఉత్తరం :** తిప్పగుడిశ కోటేశ్వరరావు గారి ఇల్లు, **దక్షిణం :** దేవరపల్లి శరబంది గారి ఇల్లు, ఈ హద్దులలో విస్తీర్ణం 120 చ.గ స్థలం ఈ స్థలం లో నిర్మించిన Rcc దాబా ఇల్లు కట్టడం 705 చ.అడుగులు యావత్తు రాకపోకల దారి హక్కులతో సహా

శిఖాకొల్లి రమేష్, న్యాయవాది
A-బ్లాక్, 4th ఫ్లోర్, షాప్ No: 5 (A), గుప్తస్ స్క్వైర్, 60 ఫీట్స్ రోడ్, ఒంగోలు,ప్రకాశం డిస్ట్రిక్ట్. ఫోన్ No: 9949136259.

పబ్లిక్ నోటీసు

బాపట్ల జిల్లా, అద్దంకి మండలం, బత్తులవారి వారిపాలెం గ్రామం, అద్దంకి టౌన్, అద్దంకి మండలం, **యరమోతు తిరుమలరావు తండ్రి లేట్ సాంబశివరావు** ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియ జేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని నా క్లయింట్ యరమోతు తిరుమలరావు వారి తండ్రి గారైన సాంబశివ రావు గారు ఎవ్వరికీ ఎట్టి వ్రాతలు వ్రాయకుండా వారి ఆకస్మిక మరణానంతరం వారసత్వ రీత్యా సంక్రమించిన ఆస్తిని వారి ఇద్దరు కొడుకులు తిరుమలరావు మరియు ఈశ్వర్ బాగ పంపిణీ చేసుకొని, బాగా పంపిణిలో A షెడ్యూల్ ఆస్థి భాగము తిరుమలరావుకి రాబడి అద్దంకి సబ్‌రిజిస్ట్రర్ వారి ఆఫీస్‌లో రిజిస్టర్ కాబడిన బాగాపంపిణీ **దస్తావేజు నెంబర్ 6599/2021** ద్వారా నా క్లయింట్‌కి సంక్రమించబడి తదాది నా క్లయింట్ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగియున్నారని మరియు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థిని **"కెనిఫిన్ హోమ్స్ లిమిటెడ్"** ఒంగోలు వారి వద్ద తనఖా ఉంచి ఋణం తీసుకొనుచున్నారు. కావున ఎవరికైనను సదరు ఆస్థి గురించి గాని, హక్కుల గురించి గాని అభ్యన్తరాలు వున్నయెడల లిఖితపూర్వకంగా తగిన దస్తావేదులతో ఈ నోటీసు ప్రకటించిన **(ఏడు) దినములలోపు,** ఈ క్రింది సంతకం దారుని సంప్రదించగరలరు. లేని యెడల ఎవ్వరికీ ఏవిధమైన అభ్యన్తరాలు గాని, హక్కులు గని లేవని భావించి మా క్లయింట్ దిగువ షెడ్యూల్ ఆస్థి పై ఋణము తీసుకొనగలరు గడువు తరువాత వచ్చు అభ్యన్తరాలును మా క్లయింట్ గాని రుణదాతను కానీ సిద్ధపరచ జాలవని యావన్మందికి తెలియజేయటమైనది.

షెడ్యూల్

ప్రకాశం జిల్లా, ప్రస్తుత బాపట్ల జిల్లా, మార్కాపురం డిస్ట్రిక్ట్ ఏరియా, అద్దంకి సబ్ డిస్ట్రిక్ట్ లో చేరిన అద్దంకి మండలం, అద్దంకి నగర పంచాయితీ ఏరియా ఉత్తర అద్దంకి గ్రామ సర్వే నెంబర్. 1064, అసెస్మెంట్ No. 1147001497, డోర్ నెంబర్. 20 -86, 20 - 87 ర్లు, ఇల్లు, స్థలంకు హద్దులు

తూర్పు :10 అడుగులు వెడల్పుగల బజారు, **పడమర:** యరమోతు శ్రీనివాసరావు ఇల్లు, **ఉత్తరం:** బి షెడ్యూల్ వాటాదారుని రాబడిన ఆస్థి, **దక్షిణం:** పండి యోహాను, నక్క పున్నయ్య గార్ల ఆస్థి, ఈ హద్దులలో విస్తీర్ణం 369.78 చ .గ స్థలం ఈ స్థలం లో నిర్మించిన ACC రేకుల ఇల్లు కట్టడం 540 చ.అడుగులు యావత్తు రాకపోకల దారి హక్కులతో సహా

శిఖాకొల్లి రమేష్, న్యాయవాది
A-బ్లాక్, 4th ఫ్లోర్, షాప్ No: 5 (A), గుప్తస్ స్క్వైర్, 60 ఫీట్స్ రోడ్, ఒంగోలు,ప్రకాశం డిస్ట్రిక్ట్. ఫోన్ No: 9949136259.


కిట్లను పంపిణీ చేస్తున్న గుంటక తిరుపతిరెడ్డి

'ఆడుదాం ఆంధ్ర' కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలో 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రికెట్, టెన్నిస్, వాలీబాల్, ఖోఖో, ఇతర గేమ్స్‌కు సంబంధించిన కిట్లను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా జడ్‌పిటిసిల సంఘం అధ్యక్షుడు, వెలిగండ్ల జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు రామన మహాలక్ష్మి చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ 15 సంవత్సరాలకు పైబడిన వారందరినీ క్రీడల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం సాధించడం, సంతోషాన్ని పంచుకోవడం సాధ్యమవుతుందన్నారు. క్రీడా సంస్కృతిని విస్తృతం చేసే దిశగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. అందుకోసం ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ దశల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తుందనివ అన్నారు. ఈ నెల 15 నుంచి జరిగే ఆటల పోటీల్లో మండల స్థాయిలో అందరూ పాల్గొని నియోజకవర్గ స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతిరెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాతపూడి సుకుమార్, వైసిపి మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, సర్పంచులు గాలి తిరుపతిరెడ్డి, తాతపూడి సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు విజయ భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, షేక్ రజియా, పద్మ, గిరిధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

గిరిజనుల సమస్యలపై అశ్రద్ధ వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గిరిజనుల సమస్యల పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకర్‌రావు తెలిపారు. మండల పరిధిలోని ఇష్టకామేశ్వరి, అంకమ్మ చెంచుగూడేలను సోమవారం సందర్శించారు. అనంతరం పునరావాస కాలనీలో రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖ అధికారులు, గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. అటవీ ప్రాంతంలో ఉన్న తమను మైదాన ప్రాంతానికి తీసుకువస్తామని చెప్పి పునరావాస కాలనీకి తెచ్చి కనీస సౌకర్యాలు కల్పించలేదని చెప్పారు. ఆర్‌డిఎ వారు పక్కా గృహాలు నిర్మించడంతో ఇక్కడే ఉంటున్నామన్నారు. లైట్లు, మంచినీరు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. భూములు లేక పక్క గ్రామాలకు కూలీ పనులకు వెళ్తున్నామని వాపోయారు. స్పందించిన ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకర్‌రావు మాట్లాడుతూ వెంటనే పునరావాస కాలనీలో విద్యుత్ లైట్లు వేయించాలన్నారు. బోరు వేసి మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి కుటుంబానికి ఐదు ఎకరాల భూమిని అటవీ హక్కుల చట్టం ద్వారా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టి కమిషన్ సభ్యులు కొర్రా రామలక్ష్మి, జంపరంగి లిల్లీ సురేష్, వడిత్యా శంకర్ నాయక్, చిచ్చడి మురళి, ఎస్‌సి ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాండ్లావత్ శ్రీనివాస్ నాయక్, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డిఎల్‌డిఒ సాయికుమార్, మార్కాపురం డిఎస్‌పి వీర రాఘవరెడ్డి, తహశీల్దారు రవీంద్రారెడ్డి, ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్, ఐటిడిఎ డిప్యూటి డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ శ్రీనివాసరావు, వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కోటానాయక్, ఎస్‌ఐ వెంకట రాజేష్, అటవీ శాఖాధికారి చెన్నయ్య, సుద్దకురవ తండా సర్పంచి వెంకటేశ్వర్లు నాయక్, ఎంపిటిసి హరిబాబు నాయక్, వైసిపి ఎస్‌టి సెల్ అధ్యక్షుడు రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్న ఊర్లో ఉపాధి లేక..

యువత వలసబాట • ఖాళీ అవుతున్న గ్రామాలు • పామూరు మండలంలో దుస్థితి

ప్రజాశక్తి-పామూరు

మండలంలో ఈ యేడాది సకాలంలో సరైన వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయం సరిగా సాగలేదు. దీంతో పనులు దొరకక రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో రైతులు అప్పులపాలయ్యారు. మండలంలో ఉపాధి లేక యువతీ యువకులు ఇతర ప్రాంతాలకు వలస బాటపట్టారు. మండలంలో 25 పంచాయతీల్లో 69 గ్రామాలు ఉండగా ప్రతి గ్రామం నుంచి వలస వెళ్లారు. ఏ ఊరికి వెళ్లినా ఇళ్లకు తాళాలు వేసి కనిపిస్తున్నాయి. కొన్ని ఇళ్లకు వృద్ధులు కాపలాగా ఉన్నారు. మండల పరిధిలోని మార్కొండపురం పంచాయతీలోని ప్రతి ఇంటిలో దాదాపు అందరూ ఒరిస్సా, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు పనుల కోసం వలస వెళ్లారు. వ్యవసాయ భూమి ఉన్నా సాగుకు నోచుకోకపోవటంతో ఇక్కడి ప్రజలు బతుకుతెరువు కోసం వలసపోక తప్పడంలేదు. పంటలకు భూమి ఉన్నా పండించేందుకు రైతులు ఉన్నా నీటి సౌకర్యం లేక భూములు వెలవెలబోతున్నాయి. పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని సిపిఎం


యజమానులు వలసపోవడంతో తాళం వేసి ఉన్న ఓ ఇల్లు


మార్కొండాపురంలో ఇళ్లకు కాపలాగా ఉన్న వృద్ధుడు

ఆధ్వర్యంలో పాదయాత్రలు, ధర్నాలు, ఆందోళనలు నిర్వహించిన విషయం తెలిసిందే. పాలకుల నిర్లక్ష్యం వలన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాలేదు. ప్రాజెక్టుకు పూర్తి చేసి వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తే వలసల నివారణ సాధ్యమవుతుంది.

వ్యవసాయానికి నీటి వసతి లేదు: రోశయ్య, గ్రామస్తుడు



నీటి సౌకర్యం లేక వ్యవసాయం చేయలేక పోతున్నామని మార్కొండపురం గ్రామానికి చెందిన రోశయ్య తెలిపారు. వేసిన పైర్లకు గిట్టుబాటు ధర లేక, పెట్టిన పెట్టుబడి తిరిగి రాక రైతులు అప్పులు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధి లేక యువత ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినారు. కొందరు పశువులు, జీవాలను మేపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఈ ప్రాంతానికి జీవనాధారం. వెంటనే వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తేవాలి.

పారదర్శకంగా కులగణన సర్వే

జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కులగణనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకాశం జిల్లా జడ్‌పిటిసిల సంఘం అధ్యక్షుడు వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుంచి మండలంలో జరిగే కులగణన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, మండల స్థాయి అధికారులు, కులగణనలో పాల్గొనేవారు ఈ సర్వే పూర్తయ్యే వరకు మొబైల్ ఫోన్లు మార్చవద్దని కోరారు. సమాచారం ఇతరులకు షేర్ చేయవద్దని అన్నారు. ఈ సర్వేపై మండల పరిషత్ అభివృద్ధి


మాట్లాడుతున్న జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి

అధికారి తాతపూడి సుకుమార్ సచివాలయ సిబ్బందికి, మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు రామన మహాలక్ష్మి, తహశీల్దారు ఎన్ వాసు, మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకుడు నాగూర్‌యాదవ్, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సు కోరే కాంగ్రెస్‌కు పట్టం

కనిగిరిలో పార్టీ శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-కనిగిరి

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించిన సందర్భంగా కనిగిరి పట్టణంలో స్థానిక పామూరు బస్టాండ్ చర్చి సెంటర్లో పీసీసీ సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పాటైన తర్వాత తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు అనుముల రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన మెజారిటీ శాసనసభ సీట్లు గెలిచిన సందర్భంగా సమన్వయ కమిటీ సభ్యుల సమక్షంలో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, తెలంగాణకు ముఖ్యమంత్రి కాబోతున్న రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిసిసి సభ్యులు పిల్లి వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ నియంతృత్వ పాలన సాగిస్తున్న కెసిఆర్ కుటుంబ పాలనకు తగిన గుణపాఠం చెప్పేలా ప్రజా సంక్షేమం కోరే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం


సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కట్టారని అన్నారు. ఇచ్చిన హామీలను తప్పకుండా కాంగ్రెస్ పార్టీ నెరవేర్చి ప్రజల పట్ల ఉన్న అభిమానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాటుకుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు షేక్ హల్గోజి మస్తాన్, షేక్ మహమ్మద్ బాషా, సంగటి మల్లికార్జునరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలైన బలసాని కోటేశ్వరావు, రమణయ్య, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.


ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న తహశీల్దారు వెంకటేశ్వరరావు తదితరులు

ఘంటసాల పాటలు మరువలేనివి: తహశీల్దార్

ప్రజాశక్తి-దర్శి

మధుర గాయకుడు ఘంటసాల పాడిన పాటలు ప్రజలు గుండెల్లో చిరకాలంగా ఉండిపోతాయని స్థానిక తహశీల్దారు వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పద్మశ్రీ ఘంటసాల కీర్తిశేషులు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు తహశీల్దారు కార్యాలయంలో జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ సేవకులు, జాతీయ అవార్డు గ్రహీత జీవీ రత్నం మాట్లాడుతూ మధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు పాడిన పాటలు మరిచిపోలేనివని, అవి ప్రజలు ఉన్నంత వరకు ఉంటాయని అన్నారు. అంబేద్కర్ 67వ వర్ధంతి సభ కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ నెల 6వ తేదీన ఎంపీడీఓ ఆఫీసులో అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే సభను జయప్రదం చేయాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ రవిశంకర్, ప్రేమ్‌కుమార్, దేవప్రసాద్, మోషే, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ఆకుకూరలు కొంటున్న మహిళలు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఎంతో మేలు

ప్రజాశక్తి-దర్శి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కూరగాయలు, ఆకుకూరలు ఎంతో మేలు అని ఏవో బాలకృష్ణ నాయక్ అన్నారు. స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద సోమవారం రిలయన్స్ ఫౌండేషన్, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల తయారీ వారి ఆధ్వర్యంలో కూరగాయల అమ్మక కార్యక్రమాన్ని ఏవో ప్రారంభిం చారు. ఆరోగ్యానికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఎంతో మేలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ మేరి జెసిల్లా, యూనిట్ ఇన్‌ఛార్జి జి మూర్తయ్య, జి మురళీకృష్ణ, సుబ్బారావు, బాల కోటయ్య, సుధీర్, మోహన్‌రావు, మహిళలు పాల్గొన్నారు.

పొలాల్లో నీటిని బయటకు పంపాలి: ఎఒ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ప్రస్తుత తుఫాను వల్ల రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారి ప్రసన్నరంగలక్ష్మి సోమవారం తెలిపారు. వర్షం ప్రభావంతో పొలాల్లోకి చేరిన నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపాలన్నారు. తరువాత పొటాషియం నైట్రేట్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మిరప పంటలో నీరు అధికంగా ఉంటే ఎండు తెగులు ఆశిస్తుందని, అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, పిచికారీ చేయాల్సిన మందులను గురించి వివరించారు. రబీ పంటలకు సంబంధించి పంట నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వారి పాస్ పుస్తకంతో రైతు భరోసా కేంద్రాల్లోని విఎఎ, విహెచ్‌ఎల ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-దర్శి

మిచౌంగ్ తుఫాన్ కారణంగా సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు పడుతున్నప్పటికీ ఎలాంటి నష్టాలు జరగలేదని, దీనిపై తహశీల్దార్ కార్యాలయానికి సాయంత్రం వరకు ఎలాంటి సమాచారం లేదని డీటీ ఏ రవిశంకర్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు రావద్దని ఆయన కోరారు. అదే విధంగా 1.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ ప్రసాద్ తెలిపారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కనపర్తి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

వేమూరు మండలం బలిజేపల్లి గ్రామానికి చెందిన కనపర్తి ఏలియా అనారోగ్యంతో మృతి చెందగా సమాచారం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలెంరాజ్ మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు నిరంతరం అందుబాటులో ఉంటామని షాలెంరాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పులివర్తి మేరీస్ బాబు, ఎలిసెర్ల శోభన్ బాబు, పచ్చిగళ్ళ అనిల్, ఎలిసెర్ల సురేష్ ఉన్నారు.



కత్తి శ్రీనివాసరావుకు అవార్డు అందజేస్తున్న కల్నల్ శంకర్

శ్రీనివాసరావుకు ఉత్తమ పురస్కారం

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక మున్సిపల్ హై స్కూల్ పిడి, ఎన్‌సిసి చీఫ్ కత్తి శ్రీనివాసరావు ఎన్‌సిసి ఉత్తమ సేవ పురస్కారం అందుకున్నట్లు హై స్కూల్ హెచ్‌ఎం రాజశ్రీ తెలిపారు. తెనాలి 22వ ఆంధ్ర బెటా లియన్ ఎన్‌సిసి కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎన్‌సిసి కల్నల్ ఎన్ ఉమాశంకర్, లెఫ్ట్ నెంట్ కల్నల్ జె మహేష్ ఉత్తమ పురస్కారం అందజేశారు. ఎన్‌సిసి ఉత్తమ పురస్కారం అందుకున్న పిడి శ్రీనివాసరావును పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



సుబ్రమణ్యంకు నియామక పత్రం అందజేస్తున్న రంగారావు

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి - చీరాల

దేశంలో ప్రజల ఆలోచనలో మార్పు వస్తుందని, రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కాంగ్రెస్ ఇంచార్జి దేవరపల్లి రంగారావు కోరారు. స్థానిక డ్రైనేజీ గెస్ట్ హౌస్‌లో కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షుడిగా పందరబోయిన సుబ్రహ్మణ్యంకు నియామక పత్రం సోమవారం అందజేశారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, జిల్లా అధ్యక్షులు గంట అంజిబాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ బలోపేతం చేసేందుకు కమిటీలు వేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పేర్లి బుజ్జిరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు యర్రాకుల శ్రీనివాసరావు, కాంగ్రెస్ వేటపాలెం మండల అధ్యక్షులు యెనుముల సూర్య ప్రదీప్, కర్రెద్దుల సురేష్, పట్టణ అధ్యక్షులు బండ్లమూడి విజయ్ కుమార్, మేరిగ రమేష్ బాబు, షేక్ బాషా పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - చీరాల



రోశయ్య విగ్రహానికి నివాళులు

మాజీ సిఎం డాక్టర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా ఎంజిసి మార్కెట్ వద్ద ఉన్న రోశయ్య విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టిడిపి చీరాల పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను, జి సాయి, చుండూరి రాంప్రసాద్, సాతులూరి మల్లికార్జున రావు, పూర్ణచంద్ర రావు, కొండు రత్నబాబు, అయ్యో ఖాన్, మోహిద్దీన్ పాల్గొన్నారు.

నేలవాలిన వరి పైరు..అన్నదాత ఆందోళన



నేలకొరిగిన వరి పైరును పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి జన్నెమ్మ



రోడ్డుపై వరికుప్పలపై పట్టలు కప్పిన రైతులు

ప్రజాశక్తి - రేపల్లె

వరి రైతుపై వరుణుడు విలయం సృష్టిస్తున్నాడు. భారీ వర్షం, గాలి వానకు వరి సాగు చేసిన రైతులు బెంబేలెత్తుతున్నారు. చేతికి వచ్చిన పంట వర్షపునీటిలో నేలపై వాలింది. వాయుగుండం ప్రభావం వల్ల వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో అన్నదాత వెన్నులో వణుకు మొదలైంది. ఎకరాకు 30నుంచి 45బస్తాల వరకు దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. వివిధ గ్రామాల్లో 35శాతం వరకు పంట కోసి పొలాల్లో పనలుగా ఉన్నాయి. ఇప్పుడు ప్రకృతి ప్రకోపిస్తే ఎకరాకు రూ.35వేల వరకు పెట్టుబడి తోపాటు ఆరుగాలం శ్రమ నీటి పాలవుతుందని భయాందోళన చెందుతున్నారు. తుఫాన్ తీవ్రత పట్ల అవగాహనతో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని అన్నారు. డిసెంబర్ 4, 5తేదీల్లో పిల్లలు, గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లల తల్లులు, వయో వృద్ధులు ఇల్లు విడిచి బయటకు రావద్దని అన్నారు. తహాశీల్దారు వెంట మున్సిపల్ కమిషనర్ బి విజయసారథి, ఏడిఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్, ఏఓ వాగోలు బుష్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : మిచాంగ్ తుఫాను దాటికి మండలంలో వరి పైరు అక్కడక్కడ నేల వాలింది. కొంతమేర వరికుప్పలు వేసినప్పటికీ మరికొంత వరిపైరు కుప్పలు వేయకపోవడంతో వర్షానికి నీళ్లలో తడిచింది. 60శాతానికిపైగా వరిపైరు కోత దశకు వచ్చి కోయల్సి ఉండగా తీవ్ర తుఫాను నేపథ్యంలో సోమవారం సాయంత్రం వరకు గాలులతో కూడిన జల్లులు పడడంతో రైతులు ఆందోళన చెందారు. తహసిల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

భట్టిప్రోలు : మిచౌంగు తుఫాను కారణంగా నిరంతరాయంగా కురిసిన వర్షానికి పంట పొలాలు పూర్తిగా నేలవాలాయి. మరికొన్ని చోట్ల ఓదెలలో నీరు నిలబడింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నిన్నటి వరకు నిలబడి రైతులకు ఆశలు చూపించిన వరి పంట నేడు వర్షానికి నేల వాలి నీళ్లల్లో తేలి ఆడుతుండటంతో అన్నదాత గుండె పగిలినంత పనవుతుంది. ఏడాది పంటలు ఆశాజనకంగా ఉన్నాయని ఆశపడిన రైతుకు తుఫాను పెను ముప్పును కలిగిస్తుందని వాపోతున్నారు. కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలవాలి నీటిలో ఉండటంతో గింజ మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అంతేకాక నేల వాలిన పైరును కోతలు కోయడానికి కూడా అధిక కూలిలు వెచ్చించాల్సి ఉంటుందని రైతులు అంటున్నారు. దాన్యం నాణ్యత తగ్గి ధరల కోత విధించబడుతుందని వాపుతున్నారు.

పంగులూరు : మండలంలో రబీలో 6,645ఎకరాలు శనగ సాగు చేశారు. మరో 2,500ఎకరాల వరకు సాగయ్యే అవకాశం ఉంది. గత 15రోజుల నుండి శనగ ఎద పెడుతున్నారు. కొంత భాగం మొక్క పైకి రాగా, కొంత పొలం ఇంకా మొక్క భూమిలోనే ఉండి పోయింది. వర్షం ఉద్ధృతి పెరు గుతున్నడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. శనగలు క్వింటా రూ.12వేల నుండి రూ.13వేల వరకు ధర పలుకుతుండటంతో రైతులు శనగ సాగు పట్ల ఆసక్తి చూపారు. మొలక రాని పొలం రైతులు నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల కురిస్తే మునిగిపోయి ఉరకెత్తిపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. శనగ రైతులు ఎకరానికి విత్తనాలు, వ్యవసాయానికి, ఎరువులకు కలిపి రూ.15వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఇది మొత్తం నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

ఇంకొల్లు : మిచ్చింగ్ తుఫాను ప్రభావంతో పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, యద్దనపూడి, మార్టూరు, చిన్నగంజాం, పంగులూరు మండలాల పరిధిలో ఒక మోస్తరు జల్లులతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. రబీ పంటగా సెనగ సాగు 2వేల హెక్టార్లలో విత్తనాలు ఎద పెట్టారు. కారంచేడు, ఇంకొల్లు, మండలాలతో పాటు చిన్నగంజాం మండలంలోని గొనిసపూడి, రావూరు, తిమ్మసముద్రం గ్రామాల్లో మాగాణి లోతట్టు పొలాల్లో ఇంకా విత్తనాలు వేయలేదు. శనగ ఎదబెట్టి ఈపాటికి మొలకెత్తిన పొలాల్లో కలుపు బెడద ఉంటుందని రైతులు వాపోతున్నారు. అలాగే ఏపుగా పెరిగిన బర్లీ పొగ తోటలు, మిరప తోటలు ఏకంగా వానలు కురిస్తే ఊరకెత్తుతాయన్న ఆందోళనలో ఉన్నారు.



పగులూరులో నేలవాలిన వైట్‌బర్లీ పొగతోటలు



చెరుకుపల్లిలో సమీక్షిస్తున్న స్పెషల్ ఆఫీసర్ తమ్మాజీరావు

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు



పునరావ కేంద్రంలో జెసి శ్రీధర్ పరిశీలన

మిచౌంగు తుఫాను ప్రభావానికి ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి, జిల్లా ప్రస్తుత శాఖ జాయింట్ డైరెక్టర్ హనుమంతరావు సూచించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తుఫాను ప్రభావంతో సోమవారం రాత్రి నుండి మంగళ, బుధవారాలు కూడా భారీ నుండి అతిభారి వర్షాలు కురిసే అవకాశం ఉందనే హెచ్చరికల దృష్ట్యా ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు ధూళిపూడి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్, ఎస్ఐ అంబటి చంద్రశేఖర్, ఎఓ వీరయ్య, ఇరిగేషన్ ఎఇ వి రవిబాబు, ఎంఇఓ నీలం దేవరాజ్, డ్రైనేజీ ఏఈ సువత్సల, పిఓపిఆర్డి ఊహారాణి, ఏపీఎం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : తుఫాను వలన ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తుగా తగు ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి తమ్మాజీరావు అధికారులను ఆదేశించారు. తుఫాను వలన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు, పిఆర్, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఎల్పిఓ శివశంకరరావు, తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, ఎస్ఐ వై సురేష్, ఎంఈఓలు పి లాజర్, టి నవీన్ కుమార్, ఆర్ఐ, ఈఓ పిఆర్ఆర్ డి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : తుఫాను పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలలో సిబ్బంది పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్ బాబు, తహశీల్దారు పి బ్రహ్మయ్య, ఎంపీడీఓ ఆర్ఎం రాజ్యలక్ష్మి, ఈఓపిఓపిఆర్డి శ్రీనివాసరావు, ఎపిఎం టి మోహనరావు, ఏఓ నార్నె వేణుగోపాల్, విద్యుత్ శాఖ ఏఇ వై రమేష్ పాల్గొన్నారు.

వేటపాలెం : మిచౌంగ్ తుపాను వలన ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తునా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం, కటారిపాలెం తుఫాన్ పునరావాస కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఒక్కొక్కరికి రూ.2500నగదు, 25కేజీల బియ్యం, కందిపప్పు, పాలు, కూరగాయలు, అవసరమైన వారికి ఆహారాన్ని అందిస్తారని అన్నారు. ఆయన వెంట చీరాల ఆర్డీఓ సరోజినిదేవి, ఆర్డబ్ల్యూఎస్ డిఇ సతీష్ చంద్ర, ప్రత్యేక అధికారి జె రాజాదిబోరా, ఎంపీడీఓ కె నేతాజీ, తహసిల్దారు అశోక్‌వర్ధన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాంకుమార్, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఎస్ఐ జి సురేష్, పంచాయితీ కార్యదర్శి శివలీ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాలలో రహదారులు పూర్తిగా జలమయం అయ్యాయి. పెదలంక మధ్యగూడెంలో ప్రధాన రహదారిపైనే నీళ్ల నిలబడి రాకపోకవలకు తీవ్రతరాయం ఏర్పడింది. భట్టిప్రోలు, ఐలవరం, వెల్లటూరు గ్రామాల్లో కూడా వర్షపు నీరు నిలబడి వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందిగా మారింది.

ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి - పంగులూరు



దంపతులకు గొట్టిపాటి ఆశీర్వాదం

నార్నెవారిపాలెం గ్రామంలో ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ సోమవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవలే వివాహం జరిగిన నార్నె శివయ్య కుమారుడు నరేంద్ర, ప్రవల్లిక దంపతులను, అదే గ్రామంలో గోరంట్ల రవి కుమారుడు గోపి, లక్ష్మి ప్రియాంకను ఆశీర్వదించారు. అనారోగ్యంతో బాధపడుతున్న రావిపాటి హనుమంతరావును పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు కుక్కపల్లి ఏడుకొండలు, శ్రీనివాసరావు, శ్రీకాంత్, సుబ్బారావు పాల్గొన్నారు.



టిడిపి వార్డు బాధ్యుల ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కొండయ్య

టిడిపి గెలుపునకు పనిచేద్దాం

ప్రజశక్తి - చీరాల

టిడిపి గెలుపుకు సమిష్టిగా కృషిచేయాలని టిడిపి ఇన్చార్జి కొండయ్య అన్నారు. గజవల్లి శ్రీనివాసరావు, డేటా నాగేశ్వర రావు, సురేష్ ఆధ్వర్యంలో 1, 5, 16, 17, 23, 26వార్డుల కార్యవర్గంను, బూత్ ఇన్చార్జిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. 1వ వార్డు అధ్యక్షులు తేళ్ల రూబేన్, కార్యదర్శి తిరువీధుల మురళి, 5వ వార్డు అధ్యక్షులు గుత్తికొండ వెంకయ్య, కార్యదర్శి అవ్వారు కుమార్, 16వ వార్డు అధ్యక్షులు దాసరి రామారావు, కార్యదర్శి చీమకుర్తి ప్రకాష్, 17వ వార్డు అధ్యక్షులు పంది భాస్కర్, కార్యదర్శి అచ్చుల వెంకటేశ్వర్లు, 23వ వార్డు అధ్యక్షులు పులుపుల శంకరశాస్త్రి, కార్యదర్శి వేముల శ్రీను, 26వ వార్డు అధ్యక్షులు రాసాల శ్రీను, కార్యదర్శి అల్లూరి పిచ్చయ్య ఎంపిక అయ్యారు.

తీరంలో అలల ఉధృతి

- ఊళ్లపాలెంలో ముందుకొచ్చిన సముద్రం
- రంగంలోకి దిగిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం
- మత్స్యకారులను అప్రమత్తం చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మిచౌంగ్ తుఫాను ప్రభావంతో శింగరాయకొండ మండలం పాకల పల్లెపాలెం వద్ద తీరంలో అలలు ఉధృతంగా ఎగసి పడుతున్నారు. అలల తాకిడికి సముద్రం కోతకు గురైంది. తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి గాలులతో కూడిన వర్షం పడుతోంది. గాలులు,వర్షం కారణంగా పల్లిపాలెం వద్ద సముద్రం కోతకు గురైంది. పోతయ్య గారి పట్ట పు పాలెం వద్ద మత్స్యకారులు ఎండ్రకాయల కోసం వల వేశారు. వల తీసేందుకు మత్స్యకారులు బోటులో వెళ్లారు. ఆ బోటు బోల్తాకొట్టింది. మత్స్యకారులకు ఎలాంటి అపాయం జరగలేదు. వల దెబ్బతిన్నట్లు మత్స్యకారులు తెలిపారు. దెబ్బతిన్న వలను మత్స్యశాఖ ఎడి చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. మత్స్యకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పాకల సముద్ర తీరంలోనూ అలలు ఉధృతంగా ఉన్నాయి. ఊళ్ల పాలెంలో సముద్రం ముందుకొచ్చిటనుల మత్స్యకారులు తెలిపారు. తహశీల్దారు ఉష మత్స్యకార గ్రామాల్లో పర్యటించారు. మత్స్యకారులు బోట్లు, వలలను ట్రాక్టర్ల ద్వారా ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, జరుగుమల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు పాకల, ఊళ్లపాలెం గ్రామాలను సందర్శించారు. స్థానిక మత్స్యకారులతో మాట్లాడారు. తుఫాన్ సమయంలో అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు.



కొత్తపట్నంలో పర్యటిస్తున్న జేసీ శ్రీనివాసులు



ఎగసి పడుతున్న అలలు



దెబ్బతిన్న వలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ ఎడి చంద్రశేఖర్

టంగుటూరులో 19 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి-టంగుటూరు

మిచౌంగ్ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈదురు గాలులు వీస్తున్నాయి. సోమవారం టంగుటూరులో 19 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షం కారణంగా ప్రజలు నిత్యావసర సరుకుల కోసం కూడా బయటకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు కాలనీలు, పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు విత్తనాలు విత్తేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసి ఉంచారు. తుఫాను ప్రభావంతో పొలాల్లోకి భారీగా నీరు చేరింది.

తీరం వైపు వెళ్లొద్దు..

మిచౌంగ్ తుఫాను ప్రభావం హెచ్చరికల నేపథ్యంలో టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా తన సిబ్బందితో కలిసి తీర ప్రాంతమైన తాళ్లపాలెం గ్రామాన్ని సోమవారం సందర్శించారు. తుఫాన్ ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రామస్తులు తీరం వైపు వెళ్లవద్దని సూచించారు. తుఫాను తీరం దాటే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు

పునరావాస కేంద్రంలో తనిఖీ

మిచౌంగ్ తుఫాను తీరం దాటే వరకూ ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి. సువర్ణమ్మ తెలిపారు. టంగుటూరు. ఆలకూరపాడు గ్రామాలలో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కొల్లిబోయిన సంజీవరావు, పంచాయతీ కార్యదర్శులు నర్రా జగదీష్ బాబు, గోవర్ధన్, విఆర్ఒలు కె.నరసింహం, అడపా శ్రీహరి, బెనర్జీ పాల్గొన్నారు.

పంటలకు పొంచిఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మిచౌంగ్ తుఫాను ప్రభావంతో మండలంలో గత రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. ప్రస్తుతం మినుము , పచ్చపెసర పంటలు పూత, పిందె దశలో ఉన్నాయి. భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో రైతులు అందోళనకు గురవుతున్నారు. భారీ వర్షం పడితే పూత,పిందెరాలిపోయే ప్రమాదమున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇటీవల కొంత మంది రైతులు శనగ పంట సాగుచేశారు. శనగలు మొలకెత్తాయి. వర్షానికి మొలకలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి సుమారు 7,500 ఎకరాల్లో మిర్చి, పొగాకు, మినుము, జొన్న, పెసర, వరి పంటలు సాగు చేశారు.

తీరంలో జేసీ పర్యటన

ప్రజాశక్తి -కొత్తపట్నం

మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో కొత్తపట్నం పల్లెపాలెం వద్ద తీరాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో మాట్లాడారు. తోతట్టు ప్రాంత పజలను పునరావాస కేంద్రానికి తరలించే ప్రయత్నం చేయగా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు ముఖ్యమైన పనులు ఉంటే తప్ప బయటకు రావద్దని సూచించారు. డిపిఒ నారాయణరెడ్డి కూడా పునరావాస కేంద్ర పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు బివి. రమణారావు, సర్పంచి విశ్వనాధపల్లి ఆనంద్,గ్రామ కాపులు, అధికారులు పాల్గొన్నారు.

భయం గుప్పెట్లో ప్రజలు

- శివారు కాలనీలు, లోతట్లు ప్రాంతాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటన

ప్రజాశక్తి- ఒంగోలుసబర్బన్

మిచాంగ్ తుఫాన్ కారణంగా గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండటంలో ప్రజల్లో ఏ క్షణం ఏం జరుగుతోందనే భయం నెలకొంది. శివారు కాలనీలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు భయం భయంగానే జీవనం సాగిస్తున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ప్రజల్లో అలజడి నెలకొంది. వర్షం కారణంగా రోడ్లపై ప్రజల సంచారం తగ్గింది. అన్నీ రకాల వ్యాపారాలు మందకొడిగానే జరుగుతున్నాయి. గత రెండు, మూడు రోజులుగా పేదలు ఇళ్లకే పరిమితం కావడంతో కొన్ని కుటుంబాలలో జరుగుబాటుకు ఇబ్బందిగా మారింది. నగరంలో పునరావాస కేంద్రాలు కొన్ని ఏర్పాటు చేసినప్పటికీ చలిగాలులకు ప్రజలు పెద్దగా అక్కడికి వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది. తుఫాన్ ప్రభావం ఎప్పటికి వీడుతుందో స్పష్టత లేకపోవడంతో ప్రజలకు అవసరమైన ఆహారం, నిత్యావసర సరుకులను ప్రభుత్వం తరపున పేదలు నివాసం ఉండే ప్రాంతాలలో అందజేయాలని సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్ కోరారు. మరోవైపు అధికారులు, ప్రజా ప్రతినిధులు నగరంలోని లోతట్లు, శివారు కాలనీలలో పర్యటించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు ప్రణీత్ రెడ్డి లోతట్టు ప్రాంతాలలోని ప్రజలు సుమారు 1000 మందికి సోమవారం బోజనాలు అందజేశారు. లోతట్టు ప్రాంతాలు అయిన నెహ్రూ కాలనీ, నేతాజీ కాలనీ, బలరాం కాలనీలలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. . నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు నగరంలో విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. తుఫాన్ నేపథ్యంలో ఒంగోలు నియోజకవర్గంలో ఎవరికి ఏ సహాయం కావాలన్నా 9949796033, 8555931920, 9000443065, 7661834294,8555871450 ఫోన్ నెంబర్‌లకు తెలియజేయాలని కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోనూ టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంచారు. 08592 227799 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలియజేస్తే ఆయా ప్రాంతాలకు తమ సిబ్బంది చేరుకొని సమస్యను పరిష్కరిస్తారని కమిషనర్ వెంకటేశ్వరావు తెలిపారు.



లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మేయర్ , కమిషనర్



ఆహారం అందజేస్తున్న బాలినేని ప్రణీత్ రెడ్డి



గుండాయపాలెంలో పర్యటిస్తున్న తహశీల్దారు

గుండాయపాలెంలో..

ఒంగోలు మండలం, గుండాయపాలెం తీర ప్రాంతంలో తహశీల్దార్ పసుపులేటి మురళి పరిశీలించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలిరావాలని తహశీల్దారు కోరారు.



ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ఎమ్మెల్యే స్వామి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కొండపి

కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయన నివాస గృహంలో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో బొడ్డపాటి యలమంద నాయుడు, బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి,కష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి, శ్రీనివాసరావు, రమేష్‌బాబు, సోమయ్య, సుబ్బ రామయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

టంగుటూరు : కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి జన్మదినం సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కొండపి నియోజకవర్గంలోని నలుమూలల నుంచి టిడిపి నాయకులు స్వామి స్వగ్రామమైన తూర్పు నాయుడుపాలెం గ్రామానికి వచ్చి ఎమ్మెల్యే స్వామిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఈదర ప్రభాకర రావు, బొజ్జా శ్రీనివాసులు, తిప్పగుడిసె రమేష్, ఉపసర్పంచి డాలు వెంకట్రావు, చిరుమళ్ళ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ఉన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

ప్రజా సంక్షేమమే లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని బోయలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. అనంతరం రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, సర్పంచులు ఏకుల ముసలారెడ్డి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, తహశీల్దారుఎ రవీంద్రారెడ్డి, ఎంపిడిఒ నాగేశ్వర ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరలుఉ పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సౌత్ జోన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా దుస్తులు సోమవారం అందజేశారు. విజయవాడలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌కు సౌత్ జోన్ తరపున ఎంపికైన 15 మంది ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులకు శీలం రాము ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చుక్కా కిరణ్‌కుమార్, కొక్కిలిగడ్డ హనుమంతరావు, చొప్పర వెంకన్న, పెరకాల సునీల్‌కుమార్, శీలం ప్రవీణ్, శీలం ప్రభాకర్, అన్నం సాయినాథ్, శివ మంగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకర్‌రావు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గిరిజనాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎస్‌టి కమిషన్ రాష్ట్ర చైర్మన్ డివిజి.శంకర్‌రావు తెలిపారు. ఎస్‌సిటి కమిషన్ సభ్యులతో కలిసి స్థానిక ఆర్‌అండ్‌బి బంగ్లాలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో పర్యటించి గిరిజనుల స్థితిగతులు, వారి సమస్యలు తెలుసుకున్నట్లు చెప్పారు. దామాషా ప్రకారం గిరిజనులు తమ హక్కులు అనుభవిస్తున్నారా లేదా అనేది తెలుసుకున్నట్లు తెలిపారు. గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ద్వారా సాగు భూములను అందించి అందులో వ్యవసాయం చేసుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించి గిరిజనులను సన్నకారు రైతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులు పొందిన భూముల్లోకి వెళ్లకుండా అటవీ శాఖ అభ్యంతరాలు తెలుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. గిరిజన గూడేలకు ఇళ్ల స్థలాలు, శ్మశాన వాటికలకు స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనులు చైతన్యవంతులై తమ బిడ్డలను గూడేలలోనే కాకుండా మైదాన ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించుకోవాలన్నారు. విద్యుత్, మంచినీరు, రహదారులు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌టి కమిషన్ సభ్యులు కొర్రా రామలక్ష్మి, జంపరంగి లిల్లీ సురేష్, వడిత్యా శంకర్ నాయక్, చిచ్చుడి మురళి,ఎస్‌సి,ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాండ్లావత్ శ్రీనివాస్ నాయక్, సర్పంచులు రామావత్ అరుణాబాయి, బి.వెంకటేశ్వర్లు నాయక్, ఎంపిటిసి హరిబాబు నాయక్, వైసిపి ఎస్‌టి సెల్ అధ్యక్షుడు పి.రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'రోశయ్య' అజాత శత్రువు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం



రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

దివంగ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రాజకీయాల్లో అజాత శత్రువు అని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి కొనియాడారు. రోశయ్య వర్ధంతి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రిగా రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సేవలందించారన్నారు. తొలుత రోశయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, కౌన్సిలర్లు బుశెట్టి నాగేశ్వరరావు, కశెట్టి నగేష్‌కుమార్, చాటకొండ చంద్రశేఖర్, కొత్త వీరవెంకటకృష్ణ, డి.కరిముల్లా, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, వైసిపి నాయకులు పోరెడ్డి చెంచిరెడ్డి, బొగ్గరపు శేషగిరిరావు, బూదాల సతీష్, ఎం. ఉత్తమ్‌కుమార్ పాల్గొన్నారు. **చీమకుర్తి :** దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ద్వితీయ వర్ధంతి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు చలువాది బదరీ నారాయణ, జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నూనె హేమసుందరరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు నూనె అనుదీప్, నూనె వంశీ, ఆలపాటి నరసింహ రావు, చలువాది రమేష్, నూకల సుబ్రహ్మణ్యం, మద్ది వెంకటేశ్వర్లు, ఆలపాటి శ్రీను, కొణిజేటి శ్రీను, అద్దే శ్రీను, వెల్లంపల్లి రంగారావు, దుడ్డు రంగనాయకులు, కొలిపర్తి సుందరం పాల్గొన్నారు.



చీమకుర్తిలో దుప్పట్లు అందజేస్తున్న నాయకులు

యర్రగొండపాలెం : దివంగత ముఖ్యమంత్రి రోశయ్య వర్ధంతి ఆర్యవైశ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐవి. సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు సత్యనారాయణ, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, చిన్నమస్తాన్‌రావు, ఇమ్మడిశెట్టి కృష్ణయ్య, సూరె వెంకట రమేష్, కుందూరు ఆదినారాయణ, సంతోష్ కుమార్, కందూరి గురు, అడుసుమల్లి రామచంద్రారావు పాల్గొన్నారు.

మాఫియా ముఠా రాజ్యమేలుతోంది : కందుల

ప్రజాశక్తి-మార్కాపురం



స్థానికులతో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం నియోజకవర్గంలో మాఫియా ముఠా రాజ్యమేలుతోందని టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆరోపించారు. 22వ వార్డులో బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో భూ మాఫియా చెలరేగుతోందన్నారు. రేషన్ బియ్యం మాఫియాకు అడ్డులేదన్నారు. భూ మాఫియా బాధితులకు టిడిపి అండగా ఉంటుందన్నారు. టిడిపి అమలు చేసే పథకాలను వివరించారు. చంద్రబాబుకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు, టిడిపి నాయకులు సయ్యద్ గఫార్, పఠాన్ గులాబ్‌ఖాన్, మర్రి కొండలు, పి.హెచ్.ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సలహాలు ఇస్తున్న ఎఒ

వరి పంట పరిశీలన

ప్రజాశక్తి- రాచర్ల

మండల పరిధిలోని సత్యవోలు, సోమదేవిపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటలను ఎఒ షేక్ అబ్దుల్ రఫీక్ సోమవారం పరిశీలించారు. మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. వర్షం తగ్గేవరకూ వరికోతలు చేపట్టవద్దని తెలిపారు. వర్షం కారణంగా పొలాల్లోకి నీరు చేరితే చిన్న , చిన్న కాలువలు తీసి నీటికి బయటకు పంపాలన్నారు. పడిపోయిన వరి నిలబెట్టి కట్టలుగా కట్టాలన్నారు. వరి పంట పడిపోయినప్పుడు ధాన్యం మొలకెత్తకుండా ఎకరానికి 25 కిలోల వంతున ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవోలు గ్రామ విఎఎ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



గంగారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయ్‌కుమార్

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-చీమకుర్తి

టిడిపి సీనియర్ నాయకుడు కాట్రగడ్డ రమణయ్య సోదరుడు కాట్రగడ్డ వెంకటేశ్వర్లు(70) అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే బిఎన్. విజయకుమార్, టిడిపి నాయకులు సోమవారం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరా మర్శించారు. టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందిమళ్ళ గంగాధరరావు తండ్రి వెంటేశ్వర్లు ఇటీవల మృతి చెందారు. అందులో భాగంగా విజయకుమార్ గంగాధరరావును పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి సీనియర్ నాయకులు మన్నం ప్రసాదు, పూనాటి వెంకటరావు, యడ్లపల్లి రామబ్రహ్మం, గొల్లపూడి కోటేశ్వరరావు, .చెన్నయ్య, ఉన్నం సుబ్బారావు, మోహన్, నాగేశ్వరరావు, వై.శ్రీను, కోటయ్య, ఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సురేష్

చిన్నదోర్నాలలో బోరు ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల పరిధిలోని చిన్న దోర్నాల గ్రామంలో జీసెస్ లౌస్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి బోరు, ట్యాంకును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సంద్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ మినిస్ట్రీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు.అనంతరం మంత్రి సురేష్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ డైరెక్టర్ గుర్రం శేఖర్, వైసిపి నాయకులు గంటా వెంకట రమణారెడ్డి, జంకె సుబ్బారెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

కొత్త కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుపై ఎంపీ మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేకంగా వెనుకబడిన ప్రాంతమైన ఒంగోలు పార్లమెంట్ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసే కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ ప్రతిపాదనలపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర విద్యా శాఖ సహాయక మంత్రి సమాధానమిస్తూ ప్రస్తుతం దేశం మొత్తంలో 1,252 కేంద్రీయ విద్యాలయాలు పనిచేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 35 పనిచేస్తున్నాయన్నారు. కొత్తవి ఏర్పాటు చేయటమనేది నిరంతర ప్రక్రియ అని, ప్రధానంగా వీటి ఏర్పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన అన్ని రంగాలలో పనిచేయుచున్న ఉద్యోగుల అవసరాలు తీర్చడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.


జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మాగుంట

మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి సూచించారు. మిచౌంగ్ తుఫాన్ ప్రభావం తీవ్రంగా వుండే అవకాశం ఉండటంతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆలయాల సందర్శన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర, త్రిపుర సుందరి దేవి ఆలయాలను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్ రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యాపర్తి వీరయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బట్టపోతుల వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు యడవల్లి రామయ్య, మండల యువజన సంఘం అధ్యక్షుడు ముట్టుకోరు వెంకటేశ్వర్లు, త్రిపురాంతకం మండలం అధ్యక్షుడు డాక్టర్ తిరుపతి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నల్లబోతుల వీరాంజనేయులు, అధికార ప్రతినిధి వేముల శివన్నారాయణ పాల్గొన్నారు.



రాంబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

రాంబాబు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఆరోగ్య మిత్ర దర్శనం రాంబాబు సేవలు మరువలేనివని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దర్శనం రాంబాబు స్మంసరణ సభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని రాంబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, సర్పంచి చిత్తూరి హారిక, నాయకులు మజీద్, సన్నిధి కిశోర్ కిరణ్‌కుమార్, యోగయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అధికారులతో తహశీల్దారు సమీక్ష

గిద్దలూరు రూరల్ : మిచౌంగ్ తుఫానును సమర్ధవంతంగా ఎదుర్కొనేలా చర్యలు చేపట్టాలని తహశీల్దారు డి. సీతారామయ్య అధికారులకు సూచించారు. మండల స్థాయి అధికారులతో తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు తుఫాన్ సమాచారాము తెలు సుకుంటూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అధికారులు తమ కేటాయించిన గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

సహాయక చర్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - బాపట్ల



వేగేశన నరేంద్రవర్మ

మిచాంగ్ తుఫాను ముంచుకొస్తున్న నేపథ్యంలో టిడిపి ఇంఛార్జ్ వేగేశన నరేంద్ర వర్మ స్పందించారు. మచిలీపట్నం - బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముందస్తుగా ప్రజలు సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టుకుని ఎప్పటికప్పుడు తుఫాను సమాచారాన్ని తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తుఫాను సహాయక చర్యలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టాన్ని నివారించేలా తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. ధాన్యం కొనుగోలులో ఆంక్షలు తొలగించాలని కోరారు. తీర ప్రాంత ప్రజలను తుఫాను విపత్కర పరిస్థితుల బారిన పడకుండా తుఫాను రక్షిత భవనాలకు తరలించి అవసరమైన ఆహారం, త్రాగునీరు అందించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి కార్యకర్తలు తుఫాను సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. తుఫాను బాధితులకు టిడిపి తరపున తాము అండగా నిలుస్తామని తెలిపారు.



ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఎటువంటి అనుమతి, లైసెన్సులు లేకుండా విక్రయాలు జరుపుతున్న పురుగు మందుల షాపుపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలోని బలుసుల పాలెం పంచాయతీ మెట్టగౌడపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామంలో వై నాగరాజుకు చెందిన అనుమతులు లేని పురుగు మందుల షాపును విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఏ విధమైన రసీదులు లేకుండానే విక్రయాలు జరుపుకుంటున్నట్లుగా గుర్తించారు. రూ.1,26,536 విలువైన పురుగు మందులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్, ఎన్ఫోర్స్ మెంట్ వ్యవసాయ అధికారి కె రమణకుమార్, ఎస్ఐ ఎం రామచంద్రయ్య, ఏఒ టి బాలాజీ గంగాధర్, వీఆర్ఒ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.



లోక్ అదాలత్ వివరాలు వెల్లడిస్తున్న జడ్జి కెపి బాలాజీ

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - బాపట్ల

జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని ఈ నెల 9న బాపట్ల కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 6వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కెపి బాలాజీ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసు అధికారులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో సోమవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్షిదారులు అన్నిరకాల కాంపౌండ్, క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, రెవిన్యూ కేసుల నుండి సత్వర పరిష్కారం పొందొచ్చని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాని కోరారు. కక్షిదారులు సమయం డబ్బు ఆదా చేసుకునే విధంగా తమ కేసులను లోకదాలత్‌తో పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి వాణి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం పవన్ కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి రుక్మిణీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా, పట్టణ సిఐ శ్రీనివాసులు, చందోలు ఎస్ఐ రాజశేఖర్, కర్లపాలెం ఎస్ఐ శివయ్య, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఓటర్లకు పోస్టల్ ద్వారా నోటీసులు

ప్రజాశక్తి - ఇంకొల్లు




ఓటర్లకు పోస్టు ద్వారా నోటీసులు

నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లోని కొంత మంది ఓటర్లకు పోస్టు ద్వారా అక్నాలెడ్జ్ మెంట్ తో కూడిన నోటీసులు ఐదారు రోజులుగా పోస్ట్ మెన్లు సంబంధిత ఇంటి అడ్రస్లకు అందిస్తున్నారు. గతంలో ఫారం7 ఉపయోగించి టిడిపి సానుభూతి పరుల ఓట్లను వివిధ కారణాలతో వైసిపి గ్రామస్థాయి, బూత్ స్థాయి నాయకులచే తొలగించే ప్రయత్నం చేశారు. దీనిని గమనించిన టిడిపి వర్గీయులు ఆయా గ్రామాల్లో ఫారం7 నోటీసు ఇచ్చిన ఓటర్లు ఉద్యోగం, జీవనోపాధి, వ్యవసాయ రీత్యా పనులపై వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న అర్హులైన ఓట్లను తొలగించుటకు వీలు లేదని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. టిడిపి ఎమ్మెల్యే, బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు ఏలూరి సాంబశివరావు ఈ ఓట్ల విషయమై హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. అలాగే ఎమ్మెల్యే సాంబశివరావుతో పాటు స్థానిక వైసిపి ఇన్చార్జి ఆమంచి కృష్ణమోహన్ ఇటీవల ఓట్ల అక్రమ తొలగింపు విషయంలో అధికారులు, విఆర్ఒ పారదర్శకంగా పనిచేయకుండా, ఓట్లు తొలగించకుండా ఉంచాలని కలెక్టర్‌ను సైతం కలిసి ఫిర్యాదు చేశారు. అక్రమంగా ఓట్ల తొలగించడం, దొంగ ఓట్లు చేర్పటం విషయమై టిడిపి శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఓట్ల తొలగింపు సరైన పద్ధతి కాదని కొందరు అధికారులు, నాయకులు ఉన్నారు. చనిపోయిన ఓట్లు, డబుల్ ఎంట్రీ ఓట్లు తొలగిస్తే ఎలాంటి ఇబ్బంది లేదు కాని అర్హతగల సక్రమమైన ఓటు తొలగిస్తే, ఇప్పటికే కోర్టుతో పాటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందటం వల్ల భవిష్యత్తులో తాము ఇబ్బందుల పాలౌతామన్న భావనలో అధికారులు ఉన్నారు. ఇది ఇలా ఉంటే గత ఐదారు రోజులుగా మళ్లీ కొంతమంది ఓటర్ల ఇంటికి పోస్టు ద్వారా నోటీసులు అందిస్తున్నారు. సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకుని నోటీసులు ఇస్తున్నారు. ఈ నోటీసుల్లో ఇక్కడ తోపాటు ఇతర రాష్ట్రాలలో, ఇతర ప్రాంతాలలో ఓట్లు ఉన్న వారికే ఎక్కువగా ఇస్తున్నట్లు తెలిపారు. ఏదో ఒకచోట మాత్రమే ఓటు ఉంచుకునేలా ఓటర్ల నిర్ణయం తీసుకుంటున్నారు. ఇలాంటి డబుల్ ఎంట్రీ ఓట్లు, పోయిన ఓట్లు తొలగిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదని. ఓటర్లకు తెలియకుండా ఓటు తొలగించడం, దొంగ ఓట్లు చేర్పించిన వదిలే ప్రసక్తే లేదని టిడిపి నాయకులు తెలిపారు.

భద్రత లేని భూ హక్కు చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల



కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న లాయర్లు

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భద్రత లేని భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 4 నుండి 8వరకు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు భీమా లీలా కృష్ణ సోమవారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 27/2023చట్టం ప్రకారం స్థిరాస్తి హక్కుల కోసం పేద ప్రజలు రెవిన్యూ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని అన్నారు. ట్రిబ్యునల్‌లో బాధితులకు ఏ మేరకు న్యాయం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. మండల స్థాయిలోటైటిలింగ్ అధికారి నమోదు చేసిన భూ హక్కులపై జిల్లా స్థాయి రెవిన్యూ ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేయాల్సి వస్తోందని అన్నారు. రెండేళ్ళుగా ఈ వివాదాలపై అభ్యంతరం తెలపాలని అన్నారు. నిరక్షరాస్యులు అధికంగా నివసించే గ్రామీణ ప్రాంత ప్రజలు నష్టపోతారని అన్నారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రాల్లో ఈ చట్టం అమల్లో లేదని అన్నారు.

చీరాల : స్థానిక కోర్టు ప్రాంగణంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో భూ యాజమాన్య హక్కు చట్టం వెంటనే రద్దు చేయాలని కోరుతూ నిరసన చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షులు గౌరవ రమేష్ మాట్లాడుతూ పేదల భూములకు భద్రతలేని ఈ చట్టం అమలులోకి వస్తే మొట్టమొదట నష్టపోయేది పేదప్రజలే అన్నారు. కార్యక్రమంలో పోతిన వెంకన్న చౌదరి, మేరుగ రవి కుమార్, బుదరాజు శశి కిరణ్, ఎం అశోక్ కుమార్, తన్నీరు సురేష్, ఎం తారకరామారావు, జి స్నేహ, ఎం కొండయ్య, ఆరోగ్యరావు, బెండపూడి శ్రీనివాసరావు, జి విఠల్‌రెడ్డి, విష్ణు పాల్గొన్నారు.

రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలవాలి



రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - పర్చూరు

మిచౌంగ్ తుపాను పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచించారు. పలువురు రైతులతో మాట్లాడారు. పంటల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ తుపాను గంటకు 110కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు రక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. తుఫాను ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.

ఏలూరి విస్తృత పర్యటన

యద్దనపూడి మండలం చింతపల్లిపాడు మహేష్ నివాసంలో అయ్యప్ప స్వామి ఇరుముడి పూజల్లో పాల్గొన్నారు. పర్చూరు నెహ్రూ కాలనీకి చెందిన సయ్యద్ సుభాని మరణించగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నరాలశెట్టి కృష్ణ సతీమణి దుర్గమ్మ చిత్రపటానికి, స్థానిక అంబేద్కర్ కాలనీ చెందిన ఆర్టీసీ డ్రైవర్ దేవరపల్లి నల్లయ్య మృతదేహానికి నివాళలర్పించారు. గోరంట్లవారిపాలెం గ్రామానికి చెందిన తొలి సర్పంచ్ సురాభక్తిని రామయ్య, టిడిపి గ్రామ అధ్యక్షులు సింగు శ్రీనివాసరావును పరామర్శించారు.

భట్టిప్రోలు (వేమూరు) : తుఫాన్ వర్షానికి దెబ్బతిన్న పంటలను మాజీ మంత్రి నక్కా ఆనందబాబు వేమూరు మండలంలో పర్యటించి సోమవారం పరిశీలించారు. కళ్ళముందే నేలపాలవ్వ తుండడంతో రైతులు అల్లాడి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత నష్టం జరుగుతుంటే ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. ప్రస్తుతం 90వేల ఎకరాలకుపైగా సాగు చేయగా దానిలో 20శాతం కూడా కోతలు పూర్తి చేయలేదని, ఇంకా 80శాతం పైరు వర్షానికి నేల వాలి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కోసిన 20శాతంలో 10శాతం మిల్లర్లకు తోలగా మరో 10శాతం రహదారులపైనే గుట్టలు పోసి ఉన్నాయని అన్నారు. రంగు మారిన, మొలకెత్తిన ప్రతి గింజను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, కనగాల మధుసూధన ప్రసాద్ ఉన్నారు.



తడిసిన వరి పైరు పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

ఘంటసాలకు ఘన నివాళి

ప్రజాశక్తి - అద్దంకి



ఘంటసాల పుస్తకావిష్కరణ

పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి సందర్భంగా ఘంటసాల గాన భరతి ఆధ్వర్యంలో పట్టణంలోని ఘంటసాల విగ్రహం వద్ద సోమవారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు మోటుపల్లి రామదాసు మాట్లాడుతూ తెలుగు సినీపాటకు ఓ చరిత్రను సృష్టించిన మహాగాయకుడిగా వేల పాటలతో పండితుల నుండి పామరుల దాకా నిత్యం ప్రతి నోట వినిపించి అమృత స్వరమని అన్నారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు చందలూరి నారాయణరావు, ఆర్వి రాఘవరావు మాట్లాడుతూ మూడు వేల పాటలతో వందల రాగాలతో సంగీతాన్ని రుచి చూపి, తెలుగు సినీ పాటకు అమరత్వాన్ని ప్రసాదించి, చరిత్ర సృష్టించారని అన్నారు. అనంతరం శతాబ్ది గాయకుడు ఘంటసాల అనే పుస్తకాన్ని చందలూరి నారాయణరావుకు అధ్యక్షులు మోటుపల్లి రామదాసు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టిస్ట్ బాలు, గోగులమూడి శేషగిరి, బత్తుల అంజయ్య, పాటిబంట్ల శ్రీమన్నారాయణ, షేక్ మస్తాన్, కూరపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.ం

వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - పంగులూరు

క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా బికెసి యూత్ ఆధ్వర్యంలో మండలంలోని టి.కొప్పెరపాడు గ్రామంలో ఈనెల 15నుండి రాష్ట్రస్థాయి వాలీబాల్ (ఓపెన్) టోర్నమెంట్ జరుగుతుందని బాచిన కృష్ణ చైతన్య యూత్ కమిటీ సోమవారం తెలిపారు. టి.కొప్పెరపాడు ఎంపీయుపి స్కూల్ గ్రౌండ్‌లో సాయంత్రం 3గంటల నుండి రాత్రి 10గంటలవరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. రూ.50వేలు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు మొదటి స్థానాలుగా స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆటగాళ్ళు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారై ఉండాలని, క్రీడాకారులకు డ్రెస్ కోడ్ తప్పనిసరని, ఒక టీంలో క్రీడాకారుడు మరొక టీంలో ఆడకూడదని, తుది నిర్ణయం ఎంపైర్‌దేనని తెలిపారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనదలచిన వాళ్ళు ఈనెల 13లోపు రూ.2వేలు ఎంట్రీ ఫీజుతో నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 7730877727 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.ం

అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - బాపట్ల

తుఫాను కారణంగా అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినప్పటికీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు అందుబాటులో ఉండాలని సిడిపిఒ బి శైలజ సోమవారం తెలిపారు. మిచాంగ్ తుఫాను నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణీలు, బాలింతలకు అవసరమైన ఆహార పదార్థాలను అందించేందుకు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని అన్నారు. తుఫాన్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని కోరారు. సెక్టార్‌లోని తీరప్రాంత గ్రామాల అంగన్వాడీలు, ఆయాలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

యుటిఎఫ్ కార్యవర్గంలో చోటు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

యుటిఎఫ్ బాపట్ల జిల్లా కార్యవర్గంలో మండలం నుండి నలుగురికి స్థానం లభించింది. కమిటీలో తమకు అప్పగించిన బాధ్యతను బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి యు చెంచయ్య, మహిళా కార్యదర్శి వి విజయలక్ష్మి, జిల్లా అకడమిక్ కన్వీనర్ సిహెచ్ హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ శివరామకృష్ణ పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ చేసే ఉద్యమాలు, పోరాటాల్లో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

తుఫాన్ బాధిత ప్రజానీకాన్ని ఆదుకోవాలి

సిపిఎం నగర నాయకులు ఏ.శ్రీనివాసులు డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తుఫాన్ బాధిత ప్రజానీకాన్ని ఆదుకోవాలని, శివారు ప్రాంతంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని సిపిఎం ఒంగోలు నగర నాయకులు ఏ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం శివారు ప్రాంతంలో ఉన్న కాలనీలో పర్యటించి ప్రజల పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ పులి వెంకట రెడ్డి కాలనీ, జాషువా కాలనీ, అశోక్ నగర్, దత్తాత్రేయ కాలనీ, సంఘమిత్ర దగ్గర నివాసం ఉండే ఎస్‌టిలు, ప్రగతి కాలనీలను పర్యటించానన్నారు. వర్షం కారణంగా నీళ్లు నిలబడి ఉండటం, కొన్ని చోట్ల ఇళ్ళ లోపలకి వచ్చాయన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని, చలికి, వర్షానికి ప్రజలు తమ తమ ఇళ్లల్లో ఉండే వీలులేదన్నారు. కనీసం వంట చేసుకునే వీలు లేదని, వారికి ప్రభుత్వం భోజన సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తుఫాన్ షెల్టర్లకు రాని శివారు ప్రాంత కాలనీ వాసులకు భోజన వసతులు కల్పించాలన్నారు.. ఎప్పటికప్పుడు కాలనీలో మున్సిపల్, రెవిన్యూ సిబ్బంది ప్రజల పరిస్థితులను తెలుసుకుంటూ ఆదుకోవాలన్నారు. తుఫాన్ పరిస్థితులు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలను ఆదుకోవాలన్నారు. సంఘమిత్ర వద్ద ఉన్న ఎస్‌టిలలో ఆడ బిడ్డకు 9 నెలలు వచ్చాయని, ఈ తుఫాన్‌తో వాళ్ళు ఉండే చిన్న ఇంటిలో చాలా ఇబ్బందిగా ఉంటున్నారన్నారు. ఆ ఆడబిడ్డను తక్షణం అధికారులు స్పందించి సురక్షితమైన హాస్పిటల్‌లో గానీ, సురక్షిత ప్రాంతానికి గానీ చేర్చాలన్నారు. ఈ శివారు ప్రాంతంలో నివాసం ఉండే ప్రజానీకాన్ని ఆదుకోవాలని కోరారు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి

దెబ్బతిన్న గృహాలకు రూ.10 వేలు..



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తుఫాను నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి మిచౌంగ్ తుఫాను, భారీవర్షాలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తుఫాను వల్ల ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మంగళవారం తుఫాను బాపట్ల, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన క్యాంపుల్లో భోజన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. క్యాంపునకు వచ్చిన కుటుంబసభ్యులకు రూ.2,500, వ్యక్తికి రూ.వెయ్యి వంతున ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. తుఫాను వల్ల దెబ్బతిన్న గహాలకు రూ.10 వేలు నష్టపరిహారం ఇవ్వాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలన్నారు. వర్షాలు తగ్గిన తరువాత పంట నష్టం అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాపట్ల జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, ఎస్‌పి వకుల్ జిందాల్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-మార్కాపురం

నగరాలు, పట్టణ వాసులతో సమానంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో రూ. 21.80లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ క్లినిక్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కోలభీమునిపాడు సర్పంచి చిట్రెడ్డి సుబ్బారెడ్డి, జమ్మనపల్లి సర్పంచి దండా వెంకటేశ్వరరెడ్డి, కె.కొత్తపల్లి సర్పంచి శ్రీరాములు, మార్కాపురం జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, కొండేపల్లి ఎంపిటిసి కుందురు మల్లారెడ్డి, వైసిపి నాయకులు పి.చెంచిరెడ్డి, కోలగట్ల శివారెడ్డి, వై.పి.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములకు విలువ పెరిగింది..

20 ఏళ్లకు పైబడి అసైన్డ్ భూములు పొందిన లబ్ధిదారుల్లో 153 మందికి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తూ పట్టాలను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి సోమవారం పంపిణీ చేశారు. స్థానిక వెలుగు కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, తహశీల్దారు మంజునాథరెడ్డి, డిప్యూటి తహశీల్దారు పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం పేదల ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో సొంత ఇల్లు లేని పేదలు ఎందరో ఉన్నారు. వైసిపి ప్రభుత్వం 7200 మంది ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగింది. కొందరికి పక్కా గృహాలు మంజూరయ్యాయి. ఇంకా సొంత ఇల్లులేని పేదలు ఉన్నారు. వారంతా తమకు ఇంటి స్థలం ఇవ్వాలంటూ స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. వారికి మద్దతుగా టిడిపి 32వ వార్డు ఇన్‌చార్జి, టిడిపి బిసిసెల్ పట్టణ ఉపాధ్యక్షుడు దూదేకుల నాసరయ్య, కాంగ్రెస్ నాయకులు అండగా నిలిచారు. అనంతరం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతిపత్రం అందించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు..

సురక్షిత ప్రాంతాలకు తరలింపు

- పునరావాస కేంద్రాలలో 800 మందికి ఆశ్రయం
- జిల్లాకు చేరుకున్న ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బందాలు
- సహాయ కార్యక్రమాల కోసం 50 బృందాల నియామకం



సూర్యలంక సముద్ర తీరంలో ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తుఫాన్‌తో జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో సమీక్ష జరిగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ బాపట్ల తీరానికి 300 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున బాపట్ల జిల్లాపై ప్రభావం చూపే అవకాశం ఉందని కలెక్టర్ అన్నారు. అత్యవసరంగా 14 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 800 మందికి ఆశ్రయం కల్పించామన్నారు. 18 మంది గర్భిణులను వైద్యశాలలకు తరలించామన్నారు. భారీ వర్షాల సూచనతో లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను యుద్ధప్రాతిపదికన తరలించాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలలో తాగునీరు, భోజనం కొరత రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 43 తుఫాను షెల్టర్లు సిద్ధం చేశామన్నారు. బాపట్ల జిల్లాకు ఎన్‌డిఆర్‌ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్), ఎస్‌డిఆర్ ఎఫ్(స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్) బందాలు రాగా నిజాంపట్నం, వేటపాలెం, రేపల్లెలో సిద్ధంగా ఉంచామన్నారు. 350 మంది ఈతగాళ్ళ, 206 మెకనైజ్డ్ బోట్లను అందుబాటులో ఉంచామన్నారు. విపత్తును ఎదుర్కొని మండలస్థాయిలో తక్షణమే పునరుద్ధరణ కార్యక్రమాల నిర్వహణకు 50 బందాలను నియమించామని తెలిపారు. తీర ప్రాంతాలైన చిన్నగంజాం, వేటపాలెం, చీరాల, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, రేపల్లె, నిజాంపట్నం, మండలలోని అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రహదారులపై చెట్లు కూలితే తక్షణమే తొలగించడానికి కటింగ్ యంత్రాలు, జెసిబిలు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు బందాలు చర్యలు తీసుకోవాలన్నారు. రవాణాశాఖ, ఆర్ అండ్ బి, ట్రాన్స్కో, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్, ఎంపీడీవోలు బందంలో ఉంటారని చెప్పారు. పునరావాస కేంద్రాలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ కేంద్రాలలో పారిశుధ్యం, వైద్యం కోసం ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

భారీ వర్షాలు కురిస్తే ఆహార పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 85,902 హెక్టార్లలో ధాన్యం సాగవుతుందన్నారు. ఏడు వేల హెక్టార్లలో ధాన్యం పంట కోశారని, 1,250 హెక్టార్లలో ధాన్యం కోసి కుప్పలుగా వేశారని, మరో 700 హెక్టార్లలో ధాన్యం పంట కోతకు సిద్ధంగా ఉందన్నారు. మిగిలిన 78 వేల హెక్టార్లలో ధాన్యం పంట 25 రోజులకు కోతదశకు చేరుతుందన్నారు. పొలాలలో నీరు నిల్వ లేకుండా దిగువ ప్రాంతాలకు తరలించేలా అధికారులు తీసుకోవాలన్నారు. 8,820 హెక్టార్లలో మిర్చి పంట, ఎనిమిది వేల హెక్టార్లలో శనగలు, అయిదు వేల హెక్టార్లలో పొగాకు పంట, 1,415 హెక్టార్లలో అరటి పంట ఉందన్నారు. ఆయా పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

తుపాను హెచ్చరికతో 258 గ్రామాలలో పోలీస్ బందాలను నియమించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కలెక్టర్ కు తెలిపారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బందాలతో కలిసి పనిచేసేలా ప్రణాళికలు రూపొందించుకున్నామని వివరించారు. రిస్క్యూ బందాలను మరింత అప్రమత్తం చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, అదనపు ఎస్పీ పి మహేష్, డి.ఆర్.ఓ. పి వెంకటరమణ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

10 రోజుల పాటు

50 శాతం రాయితీపై వైద్యపరీక్షలు

- 'లక్ష్మీ' సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో..
- వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ రవీంద్రబాబు అబ్బూరి వెల్లడి



హాస్పిటల్ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలులోని లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పది వసంతాలు పూర్తి చేసుకొని 11వ వార్షికోత్సవంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని రకాల వైద్య సేవలను తమ హాస్పటల్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రవీంద్రబాబు అబ్బూరి తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా 10 రోజుల పాటు 50 శాతం రాయితీపై వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. హాస్పిటల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆసుపత్రి ఆవరణలో నగరంలోని జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ రవీంద్రబాబు అబ్బూరి మాట్లాడారు. పదేళ్ల హాస్పిటల్ ప్రయాణంలో తమకు అన్ని విధాలా సహకరించిన రోగులు, వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. 11వ వార్షికోత్సవం సందర్భంగా కంప్లీట్ న్యూరో కేర్ సెంటర్‌ను తమ వైద్యశాలలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. న్యూరో కేర్‌కు సంబంధించిన న్యూరాలజీ, న్యూరో సర్జరీ, న్యూరో సైకియాట్రి, న్యూరో రేడియాలజి, న్యూరో ఆప్తమాలజీ, న్యూరో పాథాలజీ సేవలతో పాటు జనరల్ మెడిసిన్, ఎమర్జెన్సీ వైద్య విభాగం, మానసిక వైద్య విభాగం, చిన్నపిల్లల వైద్య విభాగం, స్త్రీల ప్రసూతి, గర్భకోశ విభాగం, ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జరీ, క్రిటికల్ కేర్ సేవలను 24 గంటలూ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. తమ పదేళ్ల లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ వైద్య ప్రయాణంలో సుమారు పదిహేను వందలకు పైగా బ్రెయిన్ సర్జరీలు, సుమారు ఆరు వేలకు పైగా స్పెయిన్ సర్జరీలు చేసి జిల్లాలోనే న్యూరో సేవల్లోనే ముందంజలో ఉన్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నట్లు తెలిపారు. న్యూరో కేర్ అంటే లక్ష్మీ హాస్పిటల్, లక్ష్మీ హాస్పిటల్ అంటే న్యూరో కేర్ అన్నట్లుగా.. తమను ఆదరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అన్ని రకాల వైద్యసేవలతో పాటు, వైద్య పరీక్షలు కూడా ఒకే చోట తమ హాస్పిటల్‌లో లభిస్తాయని తెలియజేశారు.

'కాల్‌యువర్ డాక్టర్'కు శ్రీకారం..

తమ ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా కాల్ యువర్ డాక్టర్ కార్యక్రమానికి సోమవారం నుంచే శ్రీకారం చుట్టామని తెలిపారు. ఆదివారం మినహా ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు కాల్ యువర్ డాక్టర్ కార్యక్రమంలో తమ ఆసుపత్రి వైద్యులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వైద్య సలహాలు, సూచనలు పొందాల్సిన వారు 9100011868 నెంబర్‌కు ఫోన్ చేసి ఉదయం పూట తమకు తెలియపరిస్తే ఆయా వైద్యానికి సంబంధించిన డాక్టర్లు సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు ఏసమయంలోనైనా వారితో ఫోన్‌లో ఆడియో, వీడియో కాల్ ద్వారా సంప్రదిస్తే.. వారి సమస్యలకు పరిష్కారం తెలపడం జరుగుతోందన్నారు. విలేకర్ల సమావేశంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనుశ్రీ, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ సబా, డాక్టర్ నందిని, డాక్టర్ లక్ష్మీ రేఖ, డాక్టర్ రాజ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.